www.aksharadarbar.com
గురువారం 27, జూన్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ సంచిక : 124 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

ఇసుక లారీ ఓనర్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇసుక లారీ ఓనర్లు, భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ ప్రాంతానికి చెందిన ఇసుక లారీ ఓనర్ల మధ్య ఇటీవల వివాదం తలెత్తింది. మహదేవపూర్ ప్రాంత ఇసుక లారీల ఓనర్లు జీరో, ఓవర్ లోడ్ తో ఇసుక అక్రమ రవాణా ద్వారా మార్కెట్ లో ఇసుక రేటు తగ్గిస్తున్నారని, తద్వారా పాసింగ్ లోడుతో ఇసుక రవాణా చేస్తున్న తాము ఆర్థికంగా నష్టపోతున్నామని గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఇసుక లారీ ఓనర్లు పేర్కొంటుండగా, అందులో నిజం లేదని మహదేవపూర్ ప్రాంత ఇసుక లారీ ఓనర్లు వాదిస్తున్నారు. వెరసి ఇరువర్గాల ఇసుక లారీ ఓనర్ల మధ్య వివాదం చిలికి చిలికి గాలి వానగా మారి ప్రతీకార చర్యలకు దారితీసింది. దీంతో ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులకు ఇసుక రవాణాలో జీరో, ఓవర్ లోడ్ వంటి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఓవర్ లోడ్ కలిగి ఉన్నాయని రవాణా, ఇతర శాఖల అధికారులు ఇసుక రవాణా చేస్తున్న లారీలను ఆపి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. —అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి



2 లో

కోల్డ్ వార్..!

ఇసుక లారీ ఓనర్ల నడుమ రేటు లొల్లి

- మహాదేవపూర్ ప్రాంత లారీలను ఆపుతున్న ఓరుగల్లు లారీల ఓనర్లు
- జీరో, అదనపు బకెట్ ఇసుక అక్రమ రవాణాతో ధర తగ్గిస్తున్నారని ఆరోపణ
- ప్రభుత్వం ఆదాయం కోల్పోతుండగా తామూ నష్టపోతున్నామని వాదన
- ఇరువర్గాల లారీల ఓనర్ల వివాదంతో అధికారులు ఓవర్ లోడ్ కేసులు
- రంగంలోకి ఓ మంత్రి అనుచరులు... పరిష్కరించాలని ఓ పోలీస్ అధికారికి సూచన
- వివాదంపై తాజాగా సదరు పోలీస్ అధికారి నుంచి లారీ ఓనర్లకు కబురు

రైతు బీమా కోసం

వ్యవసాయాధికారి

కక్కుర్తి..!

- బాధిత కుటుంబాలను బాధిస్తున్న వ్యవసాయ శాఖ
- బీమా కావాలంటే రూ.30 నుండి రూ.50 వేలు కట్టాల్సిందే..
- వసూళ్ల కోసం గ్రామాల్లో ఏజెంట్లు
- ముక్కు పిండి వసూలు చేస్తున్న వైనం
- పలిమెల మండలంలో లక్షల్లో వసూలు
- చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల డిమాండ్

3 లో

4 లో

పీసీసీ రేసులో

బలరాంనాయక్!

స్కూల్ బస్సు..

కారు ఢీ..

- ఆరుగురికి గాయాలు
- ప్రమాద సమయంలో బస్సులో 30 మంది పిల్లలు

4 లో

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కోల్డ్ వార్..!

ఇసుక లారీ ఓనర్ల నడుమ రేటు లొల్లి

- మహాదేవపూర్ ప్రాంత లారీలను ఆపుతున్న ఓరుగల్లు లారీల ఓనర్లు
- జీరో, అదనపు బకెట్ ఇసుక అక్రమ రవాణాతో ధర తగ్గిస్తున్నారని ఆరోపణ
- ప్రభుత్వం ఆదాయం కోల్పోతుండగా తామూ నష్టపోతున్నామని వాదన
- ఇరువర్గాల లారీల ఓనర్ల వివాదంతో అధికారులు ఓవర్ లోడ్ కేసులు
- రంగంలోకి ఓ మంత్రి అనుచరులు... పరిష్కరించాలని ఓ పోలీస్ అధికారికి సూచన
- వివాదంపై తాజాగా సదరు పోలీస్ అధికారి నుంచి లారీ ఓనర్లకు కబురు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

ఇసుక లారీ ఓనర్ల నడుమ కోల్డ్ వార్ నడుస్తోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇసుక లారీ ఓనర్లు, భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ ప్రాంతానికి చెందిన ఇసుక లారీ ఓనర్ల మధ్య ఇటీవల వివాదం తలెత్తింది. మహదేవపూర్ ప్రాంత ఇసుక లారీల ఓనర్లు జీరో, ఓవర్ లోడ్ తో ఇసుక అక్రమ రవాణా ద్వారా మార్కెట్ లో ఇసుక రేటు తగ్గిస్తున్నారని, తద్వారా పాసింగ్ లోడుతో ఇసుక రవాణా చేస్తున్న తాము ఆర్థికంగా నష్టపోతున్నామని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని ఇసుక లారీ ఓనర్లు పేర్కొంటుండగా, అందులో నిజం లేదని మహాదేవపూర్ ప్రాంత ఇసుక లారీ ఓనర్లు వాదిస్తున్నారు. వెరసి ఇరువర్గాల ఇసుక లారీ ఓనర్ల మధ్య వివాదం చిలికి చలికి గాలి వానగా మారి ప్రతీకార చర్యలకు దారితీసింది. దీంతో ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులకు ఇసుక రవాణాలో జీరో, ఓవర్ లోడ్ వంటి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఓవర్ లోడ్ కలిగి ఉన్నాయని రవాణా, ఇతర శాఖల అధికారులు ఇసుక రవాణా చేస్తున్న లారీలను ఆపి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఒక దశలో మహాదేవపూర్ ప్రాంత ఇసుక లారీలను వరంగల్ నగరంలోని ఇసుక లారీల ఓనర్లు నగర శివారులో తమ అడ్డా వద్ద ఆపి ఓవర్ లోడ్ ఉన్న ఇసుకను దిగుమతి చేస్తున్నారు. ఆ తర్వాతే పాసింగ్ లోడుతో మహాదేవపూర్ ప్రాంతానికి చెందిన ఇసుక లారీలను నగరంలోకి పంపిస్తున్నారు. ఇలా ఇసుక లారీ ఓనర్ల నడుమ వివాదం తారస్థాయికి చేరిన నేపథ్యంలో చివరకు ఓ మంత్రి అనుచరులు రంగంలో దిగారు. సమస్యను పరిష్కరించాలని వరంగల్ లోని ఓ పోలీస్ ఉన్నతాధికారికి సూచించారు. దీంతో సదరు అధికారి రెండు రోజుల తర్వాత మాట్లాడుదామని, అప్పటి దాకా సైలెంట్ గా ఉండాలని ఇరువర్గాల ఇసుక లారీల ఓనర్లకు తాజాగా చెప్పినట్లు సమాచారం. దీంతో ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక లారీ ఓనర్ల పంచాయితీ ఆసక్తి రేపుతోంది.

వివాదానికి కారణం...

మహాదేవపూర్ ప్రాంతంలో గోదావరి ఒడ్డున ప్రభుత్వ ఇసుక క్వారీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన లారీల యజమానులు ఇసుకకు ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి చలానా పొందుతున్నారు. చాలానాతో వచ్చే ఇసుక లారీల్లో మహాదేవపూర్ ప్రాంతంలోని ఇసుక క్వారీల నిర్వాహకులు ఆయా లారీ ఓనర్ చెల్లించిన డబ్బు మేరకు ఇసుక లోడ్ చేస్తారు. ఈ క్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని ఇసుక లారీల ఓనర్లతో పాటు మహాదేవపూర్ ప్రాంతంలోని ఇసుక లారీల ఓనర్లు కూడా ప్రభుత్వానికి నిర్దేశిత డబ్బు చెల్లించి క్వారీల నుంచి ఇసుక రవాణా చేస్తున్నారు. అయితే నగరంలోని లారీ ఓనర్లతో పాటు మహాదేవపూర్ ప్రాంత లారీ ఓనర్లు ఎక్కువగా ఇసుకను నిర్మాణాలు అధికంగా జరిగే వరంగల్ మహానగరంలో విక్రయిస్తున్నారు. ఇసుక అమ్మకంలో పోటీ పడుతున్నారు. కొద్ది నెలల క్రితం వరకు ఇది వివాదానికి తావు లేకుండా సాఫీగానే సాగింది. ఎందుకంటే గతంలో ఇసుక క్వారీల నిర్వాహకులు ఒక్కో బకెట్ కు రూ.2 వేలు చొప్పున తీసుకొని అడిగిన ప్రతి లారీలో అదనంగా జీరో ఇసుక లోడు చేసినట్లు ప్రచారంలో ఉంది. ఇటీవలికాలంగా ప్రభుత్వం జీరో, ఓవర్ లోడ్ ఇసుక రవాణాపై తీవ్రంగా పరిగణిస్తుంది. దీంతో ఇసుక క్వారీల వద్ద డబ్బు తీసుకొని లారీల్లో అదనంగా ఇసుకను అక్రమంగా లోడ్ చేయడం తగ్గినట్లు తెలుస్తుంది. అయితే స్థానికులైనందున మహాదేవపూర్ ప్రాంతానికి చెందిన లారీ ఓనర్ల లారీల్లో ఇసుక క్వారీల నిర్వాహకులు డబ్బు తీసుకుని అదనంగా జీరో ఇసుక లోడు చేస్తున్నారని వరంగల్ నగరానికి చెందిన లారీల ఓనర్లు ఆరోపిస్తున్నారు. ఇసుక క్వారీల నుంచి అదనంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మహాదేవపూర్ ప్రాంత లారీల ఓనర్లు వరంగల్ నగరంలో రేటు తగ్గించి విక్రయిస్తున్నారని, ఒక్కో టన్నుకు రూ. వంద నుంచి రూ.200 వరకు తగ్గిస్తున్నారని తగ్గిస్తున్నారని పేర్కొంటున్నారు. ఓవర్ లోడ్ ద్వారా జీరో ఇసుక తెచ్చి ధర తగ్గించి అమ్ముతుండటం వల్ల తాము కూడా అదే ధరపై మార్కెట్ లో ఇసుకను విక్రయించాల్సి వస్తుందని, ఇసుక క్వారీల నుంచి క్వారీల నుంచి తాము అదనంగా ఇసుకను ఓవర్ లోడ్ ద్వారా అక్రమంగా తెచ్చే అవకాశం లేకపోవడం వల్ల పాసింగ్ లోడ్ వ్యాపారంతో ఆర్థికంగా నష్టపోతున్నామని అంటున్నారు. దీంతో మొదట మార్కెట్ లో ఇసుక రేటు తగ్గించవద్దని చెప్పిన వరంగల్ నగర లారీల ఓనర్లు ఆ తర్వాత మహాదేవపూర్ ప్రాంత లారీలను నగరంలోకి ప్రవేశించడానికి ముందే హనుమాన్ జంక్షన్ సమీపంలో గల తమ అడ్డా వద్ద ఆపేస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించిన ధర మేరకు పాసింగ్ లోడుతో ఇసుకను ఉంచి లారీల్లో అదనంగా ఉన్న ఇసుకను తమ అడ్డా వద్ద దిగుమతి చేయడం మొదలుపెట్టారు. దీంతో ఇరువర్గాల ఓనర్ల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో వరంగల్ నగరంలోని లారీ ఓనర్ల లారీలను కొద్ది రోజుల క్రితం మహాదేవపూర్ ప్రాంతంలోని ఇసుక క్వారీలకు వెళ్ళగా స్థానిక లారీల ఓనర్లు ఆపడం కూడా జరిగింది. ఆ తర్వాత జీరో, లోడ్ ఓవర్ లోడ్ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వం కూడా ఆదాయం కోల్పోతుందని వరంగల్ నగరంలోని లారీల ఓనర్లు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఫలితంగా ఓవర్ లోడు ఇసుకతో బయలుదేరిన లారీలను మార్గమధ్యంలో ఆపి అధికారులు కేసులు నమోదు చేశారు. ఇలా ఇరు వర్గాల నడుమ వివాదం ముదిరింది.

రంగంలోకి మంత్రి అనుచరులు

పరిస్థితి సీరియస్ గా మారడంతో మహాదేవపూర్ ప్రాంత లారీల ఓనర్లు ఓ మంత్రి అనుచరులను కలిసి సమస్యను వివరించినట్లు తెలిసింది. మహాదేవపూర్ ప్రాంతం మంథని నియోజకవర్గం పరిధిలోనిది కావడం గమనార్హం. దీంతో మంత్రి అనుచరులు రెండు ప్రాంతాల లారీ ఓనర్ల వివాదంపై తాజాగా వరంగల్ నగరంలోని ఓ పోలీస్ ఉన్నతాధికారితో మాట్లాడినట్లు తెలిసింది. ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించినట్లు సమాచారం. దీంతో సదరు పోలీస్ ఉన్నతాధికారి గురువారం వరంగల్ నగరంలోని రెండు లారీ ఓనర్ల అసోసియేషన్ల ప్రతినిధులకు రెండు రోజుల తర్వాత వివాదంపై మాట్లాడుదామని, అప్పటివరకు సైలెంట్ గా ఉండాలని చెప్పినట్లు తెలిసింది. శుక్రవారం వరంగల్ నగరంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున ఆ తర్వాత రెండు ప్రాంతాల లారీ ఓనర్ల అసోసియేషన్ ల ప్రతినిధులను పిలిచి వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలనే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇది స్యాండ్ ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చనీయాంశమైంది.

పంటల వివరాలను పోర్టల్ లో నమోదు చేయాలి

నర్సంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు నగేష్

దుగ్గొండి రైతు వేదికలో మాట్లాడుతున్న ఏడీఏ నగేష్

అక్షర దర్బార్, నర్సంపేట : పంటల వివరాలను పోర్టల్ లో నమోదు చేయాలని నర్సంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు నగేశ్ తెలిపారు. గురువారం దుగ్గొండి మండల కేంద్రంతో పాటు మండలంలోని వెంకటాపురం, మహమ్మదాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారులతో కలిసి సహాయ వ్యవసాయ సంచాలకులు నగేష్ తనిఖీ చేశారు. అనంతరం దుగ్గొండి మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఇన్స్టాలేషన్ ప్రక్రియను సందర్శించి మండల వ్యవసాయ విస్తరణ అధికారులతో వానాకాలం సీజన్ కి సంబంధించిన పలు అంశాలపై రివ్యూ నిర్వహించారు. పంటల సాగుపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియజేసి పోర్టల్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ దయాకర్, ఏఈవోలు హనుమంతు, విశ్వశాంతి, మధు, రాజేష్, పీఏసీఎస్ సీఈవో భిక్షపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అక్షరదర్బార్, హన్మకొండ: డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. హనుమకొండ డిపో పరిధిలో ని వరంగల్, హనుమకొండ, కాజీపేట, ఖిలావరంగల్, ధర్మసాగర్, వేలేరు, జమ్మికుంట, కమలాపూర్, సంగెం, ఐనవోలు, జఫర్ గఢ్, వర్ధన్నపేట మండలాల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను, సూచనలు, సలహాలను ఇవ్వాలన్నారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959226049 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మెరుగైన సేవలు పొందేలా సూచనలు , సలహాలను ఇవ్వగలరని డీఎం తెలిపారు.

రైతు బీమా కోసం వ్యవసాయాధికారి

కక్కుర్తి..!

- బాధిత కుటుంబాలను బాధిస్తున్న వ్యవసాయ శాఖ
- బీమా కావాలంటే రూ.30 నుండి రూ.50 వేలు కట్టాల్సిందే..
- వసూళ్ల కోసం గ్రామాల్లో ఏజెంట్లు
- ముక్కు పిండి వసూలు చేస్తున్న వైనం
- పలిమెల మండలంలో లక్షల్లో వసూలు
- చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల డిమాండ్

ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత రైతు కుటుంబం

అక్షర దర్బార్, మహాదేవపూర్ : మారుమూల అటవీ మండలమైన పలిమెల మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రమాదవశాత్తు రైతులు మృతి చెందితే వచ్చే రైతు బీమా డబ్బుల మంజూరుకు రూ.30 నుండి రూ.50 వేల వరకు ముట్టజెప్పితేనే బీమా డబ్బులు వచ్చేలా చూస్తామని బాధిత కుటుంబాలను పీడించి వసూలు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పలిమెల మండల వ్యాప్తంగా గ్రామాల్లో కొంతమంది ఏజెంట్లను పెట్టుకొని బాధితుల వద్ద డబ్బులు వసూలు చేసి తనకేమీ తెలియదు అన్నట్లు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమైంది. నీలంపల్లి గ్రామానికి చెందిన వాసం పద్మ అనే మహిళా రైతు గత కొద్ది రోజుల క్రితం పిడుగుపాటుకు గురై మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులు సాక్షాత్తు ఎంపీపీ బుజ్జక్క, పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతయ్య వద్ద తమ గోడును వెళ్ళబోసుకున్నారు.. అసలే తాము పేద కుటుంబీకులమని మా వద్ద డబ్బులు లేవని అధికారికి విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతోందని.. తమరైనా కాస్త వ్యవసాయ శాఖ అధికారికి చెప్పి రైతు బీమా డబ్బులు వచ్చేలా చూడాలని వాపోయారు. గతంలో సైతం ఈ అధికారి బాధిత రైతు కుటుంబాల వద్ద భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అసలే మారుమూల అటవీ గ్రామాల్లో రెక్కాడితే కానీ డొక్కాడని రైతు కుటుంబాలు ఈ అధికారి వసూళ్ల తీరుపట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. పేద బాధిత కుటుంబాల రైతులను పీడిస్తున్న ఈ అధికారిపై ఉన్నతాధికారులు ఎంక్వయిరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ ఏవో కు వివరణ కోసం ఫోను చేయగా ఫోను లిఫ్ట్ చేయలేదు కాగా ఏఈఓ పృథ్వీరాజ్ ను వివరణ కోరగా తాను ఎవరి వద్ద వసూలు చేయలేదని చెప్పడం గమనార్హం.

28న సీఎం టెక్స్ టైల్ పార్కు సందర్శన

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

అక్షర దర్బార్ సంగెం : ఈనెల 28 శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కును సందర్శిస్తారని, పార్క్ లో ఏర్పాటైన పరిశ్రమలు, మౌలికవసతుల కల్పనపై టీఎస్ఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం గీసుగొండ, సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కును గురువారం అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరిశ్రమలు, పార్క్ కు కేటాయించిన భూముల వివరాలతో కూడిన మ్యాప్‌తో పాటు హెలిప్యాడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో గీసుగొండ ఎంపీపీ భీమ గాని సౌజన్య, సంగెం ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి , కాంగ్రెస్ మండల అధ్యక్షులు సొల్లేటి మాధవరెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

అవార్డులు అందుకున్న ఆర్టీసీ సిబ్బంది

ప్రగతి చక్రం అవార్డ్స్ పంపిణీ..

హన్మకొండ: విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు గురువారం ప్రగతి చక్రం అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ డిపోలో డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వరంగల్ రీజినల్ మేనేజర్ డి విజయభాను పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉద్యోగి తమ విధులను బాధ్యతయుతంగా నిర్వహించి అధిక ఆదాయం తేవాలని సూచించారు. అధిక ఆదాయం, పొదుపుగా ఇంధనం వాడిన ఉద్యోగులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికులను అభినందించి ప్రగతి చక్రం అవార్డులను ప్రధానం చేశారు. అంతే కాకుండా 'టీఎస్ఆర్టీసీకి అధిక ఆదాయ మార్గాలు – లక్ష్యం –టీఎస్ ఆర్టీసి ఉద్యోగుల కర్తవ్యం వారి కుటుంబ సభ్యుల పాత్ర సహకారం' పై వ్యాసరచన పోటీలో పాల్గొని ప్రతిభ కనబరచిన ఉద్యోగుల పిల్లలకు బహుమతులు అందజేశారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ లలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగుల పిల్లలను కూడా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం(ఓ)కె భాను కిరణ్, హనుమకొండ డిపో ట్రాఫిక్ సూపర్ వైజర్ నజియా సుల్తానా, మెకానికల్ సూపర్ వైజర్ వి.చంద్రశేఖర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరకట్ట నిర్మిస్తామని కాంట్రాక్టర్ నిండా ముంచిండు..

- చిన్నతూండ్ల ఆరేవాగు చెక్ డ్యాం నిర్మాణంతో కోతకు గురవుతున్న భూములు
- కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- కరకట్ట నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి రైతుల విజ్ఞప్తి

కోతకు గురవుతున్న భూమిని చూపిస్తున్న రైతులు

అక్షర దర్బార్ మల్హర్ : మండలంలోని చిన్నతూండ్ల శివారులో అరెవాగుపై చెక్ డ్యాం నిర్మాణంతో తమ భూములు కోతకు గురవుతున్నాయని రైతులు మిరియాల రవీందర్ రావు, మిర్యాల రవి, ఆవిర్నేని అచ్యుత రావు, పులిగంటి బొందయ్య, పులిగంటి బాపు, జంగ చిన్నమల్లమ్మ, ధన్నపునేని రాజేశ్వర్ రావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను తెలుపుతూ చెక్ డ్యాం నిర్మాణాన్ని తాము ముందుగా అడ్డుకున్నామని తమకు సదురు కాంట్రాక్టర్ రైతులకు ఇబ్బంది జరగకుండా కరకట్ట నిర్మాణం చేపడతానని నమ్మించి అసంపూర్తిగా చెక్ డ్యాం నిర్మాణం పూర్తి చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. చెక్ డ్యాం వల్ల గత ఏడాది భారీ వర్షాలతో పొలాల మీదుగా వరద పోయి పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, దీంతో లక్షలు ఖర్చు చేసి భూములను సాగులోకి తీసుకొచ్చామని రైతులు తెలుపుతున్నారు. గతంలో కొంత వాగు వెంట కరకట్ట కోసం మట్టి పోసినా అది వరదలకు కొట్టుకు పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిస్తే భారీ వరదలతో తమ భూములు చెక్ డ్యామ్ వల్ల కోతకు గురవుతాయని.. ఇదే విషయం అధికారులు, కాంట్రాక్టర్లకు ఎన్నిసార్లు చెప్పినా పెడచెవిన పెడుతున్నరని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కరకట్ట నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమను ఇబ్బందులకు గురిచేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కరెంట్ షాక్ తో పాడి పశువులు మృతి

సుమారు రూ.5 లక్షలు నష్టం

ఆదుకోవాలని రైతు వేడుకోలు

అక్షర దర్బార్ మల్హర్ : మల్హర్ మండలంలోని ఎడ్లపల్లి గ్రామ శివారు పంట పొలాల్లో కొండంపేట గ్రామానికి చెందిన తెప్పల మధుసూదన్ కి చెందిన నాలుగు జెర్సీ ఆవులు, ఒక ఎద్దు గురువారం మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తెగి పశువులపై పడిపోవడంతో కరెంట్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. పశువుల విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు తెప్పల మధుసూదన్ కోరాడు.

రోదిస్తున్న బాధిత రైతులు

మహాదేవపూర్ లో పోలీసుల కార్డన్ సర్చ్

గుడుంబా విక్రయదారుల ఇండ్లల్లో తనిఖీలు

పత్రాలు లేని వాహనాలు సీజ్

అనుమానితులను ప్రశ్నించిన పోలీసులు

అక్షర దర్బార్, మహాదేవపూర్ : మండల కేంద్రంలో గురువారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో గుడుంబా విక్రయదారుల ఇండ్లల్లో సోదాలు చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేశారు.. మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. కాటారం డీఎస్పీ రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్, సీఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

పీసీసీ రేసులో బలరాంనాయక్!

- తుది దశకు పీసీసీ అధ్యక్ష నియామకం కసరత్తు
- పీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న పలువురు నేతలు
- పార్టీ కోర్ కమిటీ భేటీలో నిర్ణయం జరిగే ఛాన్స్
- భేటీకి హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి
- నేడో రేపో పీసీసీపై ప్రకటన వెలువడే అవకాశం

అక్షర దర్బార్, మహబూబాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడి నియామకం కసరత్తు తుది దశకు వచ్చినట్లు తెలిసింది. చివరకు టీపీసీసీ అధ్యక్ష పదవిని ఆశించిన నేతల్లో ఇద్దరి పేర్లను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సీరియస్ గా పరిశీలిస్తున్నట్లు సమాచారం. వీరిద్దరిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మహబూబాబాద్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ ఉన్నట్లు తెలిసింది. ఈ ఇద్దరిలో ఎవరినో ఒకరిని లేదా మరో వ్యక్తిని గాని ఎంపిక చేసి నేడో రేపో పార్టీ అధిష్టానం ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్ష పదవి కాలం ఈనెల 27 తో ముగిసిపోనున్న విషయం తెలిసిందే. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో మరో నేతకు టీపీసీసీ పగ్గాలు అప్పగించాలని రేవంత్ రెడ్డి పార్టీ అధిష్టానానికి సూచించారు. పార్టీ అధిష్టానం కూడా మరో నేతకు టీపీసీసీ పగ్గాలు అప్పగించాలనే ఆలోచనలో ఉంది. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్ష పదవికి సమర్ధుడైన నేతను ఎంపిక చేసేందుకు కసరత్తు చేపట్టింది. ఈ క్రమంలో టీపీసీసీ అధ్యక్ష పదవికి ఇటీవలి కాలంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలోని పలువురు ముఖ్య నేతల పేర్లు తెరపైకి వచ్చాయి. మొదట్లో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేరు కూడా టీపీసీసీ అధ్యక్ష పదవికి వినబడింది. ఆ తర్వాత పలువురు నేతలు టీపీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నట్లు వార్తలు వెలుబడ్డాయి. ప్రధానంగా పార్టీ ముఖ్య నేతలు మధుయాష్కి గౌడ్, పొన్నం ప్రభాకర్, మహేష్ కుమార్ గౌడ్, సంపత్ కుమార్ తదితరుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా కొద్ది రోజుల నుంచి దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణతో పాటు పీసీసీ అధ్యక్ష పదవి, నామినేటెడ్ పోస్టుల నియామకంపై అధిష్టానం వద్ద చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పలువురు ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. పీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నేతలు సైతం ఢిల్లీకి చేరారు. హస్తినాలో పార్టీలోని తమ గాడ్ ఫాదర్లను కలిసి అవకాశం ఇప్పించాలని కోరుతున్నారు.

అనూహ్యంగా తెరపైకి...

కొద్దిరోజుల నుంచి అనూహ్యంగా ఎంపీ బలరాం నాయక్ పేరు పీసీసీ అధ్యక్ష పదవి రేసులోకి వచ్చింది. ములుగు మండలానికి చెందిన ఈయన 2009 పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచారు. మొదటిసారి లోక్ సభకు ఎన్నికైన బలరాంనాయక్ కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అప్పట్లో కేంద్ర మంత్రివర్గంలో కూడా స్థానం కల్పించింది. ఆ తర్వాత పార్టీలో కీలక నేతగా ఎదిగిన బలరాంనాయక్ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం పిసిసి అధ్యక్ష పదవి రేసులో నిలిచారు. కొద్ది నెలల క్రితం ఎమ్మెల్సీగా ఎన్నికైన నిజామాబాద్ కు చెందిన మహేష్ కుమార్ గౌడ్ తో పాటు బాలరాంనాయక్, ఇతర నేతల పేర్లను టీపీసీసీ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గురువారం రాత్రి ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కోర్ కమిటీ సమావేశం జరగనుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపా దాస్ మున్షీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు ఈ కోర్ కమిటీ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రివర్గం విస్తరణ, పీసీసీ అధ్యక్ష పదవి, నామినేటెడ్ పోస్టుల నియామకంపై నిర్ణయం జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ముఖ్యంగా పీసీసీ అధ్యక్ష పదవిపై ఈ సమావేశంలో తుది నిర్ణయం జరిగే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం.

వరంగల్ సమగ్ర అభివృద్ధిపై ఫోకస్

- నేరుగా మెగా టెక్స్ టైల్ పార్కుకు చేరుకోనున్న సీఎం
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల పరిశీలన
- హనుమకొండ కలెక్టరేట్ లో అభివృద్ధి పనులపై సమీక్ష జరుపనున్న ముఖ్యమంత్రి
- మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ వెల్లడి
- సీఎం పర్యటనపై ఉన్నతాధికారులతోనూ సమావేశం

అక్షర దర్బార్, హనుమకొండ: వరంగల్ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పర్యటన జరగనున్న నేపథ్యంలో గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుండి నేరుగా హెలికాప్టర్ ద్వారా వరంగల్ టెక్స్ టైల్ పార్కు కు చేరుకుంటారని సురేఖ చెప్పారు. టెక్స్ టైల్ పార్కులో ఫోటో ఎగ్జిబిషన్ ను సీఎం పరిశీలిస్తారని ఆమె పేర్కొన్నారు. వరంగల్ టెక్స్ టైల్ పార్కు సందర్శన అనంతరం పూర్వ సెంట్రల్ జైల్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పరిశీలిస్తారని అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులపై అధికారులతో సీఎం సమీక్షిస్తారని తెలిపారు. తర్వాత సీఎం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కు చేరుకొని అభివృద్ధిపై మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్షిస్తారని మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్ ను రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. దీనికి ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్మార్ట్ సిటీగా, ఇండస్ట్రియల్ కారిడార్ గా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని రంగాలలో వరంగల్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కుడా పరిధిలోని ఇతర జిల్లాల ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని అన్నారు.

- మాస్టర్ ప్లాన్ పై చర్చిస్తాం

ముఖ్యమంత్రిని కోరిన వెంటనే ముందుగా వరంగల్ లో సమావేశాన్ని నిర్వహించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసారని అన్నారు. వరంగల్ ఫైనల్ మాస్టర్ ప్లాన్ ను ముఖ్య మంత్రితో చర్చిస్తామన్నారు. మాస్టర్ ప్లాన్ తో జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. హనుమకొండ కలెక్టరేట్లో నిర్వహించే సమావేశంలో ఎజెండాలోని అంశాలను సమగ్రంగా చర్చిస్తారని పేర్కొన్నారు. వరంగల్ మాస్టర్ ప్లాన్ పై మొదటి అంశంగా చర్చించనున్నట్లు తెలిపారు. స్మార్ట్ సిటీ పథకం నిధులతో నగరంలో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. అండర్ డ్రైనేజీ నిర్మాణం, అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణం చేపట్టెందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తికి చర్యలు చేపట్టే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా శక్తి రుణాలను ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. దశల వారిగా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మామునూరు ఎయిర్ పోర్ట్, కాళోజీ కళాక్షేత్రంపై కూడా చర్చించే అంశాల్లో ఉన్నాయని మంత్రి చెప్పారు.

స్కూల్ బిల్డింగుపై నుంచి పడి విద్యార్థికి గాయాలు

ఏకశిలా పాఠశాలలో ఘటన

అక్షర దర్బార్, పరకాల : దామెర శివారు ఏకశిల హై స్కూల్, హాస్టల్ లో 7వ తరగతి చదువుతున్న కౌటం త్రినాథ్ గురువారం ఉదయం ప్రమాదవశాత్తు రెండో అంతస్తుపైనుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో విద్యార్థి తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. కాగా, ఘటనకు గోడకు ఎలాంటి రేయిలింగ్ లేకపోవడమే కారణంగా తెలుస్తోంది.

ఇకపై మండల కేంద్రాల్లో ప్రజావాణి

అక్షర దర్బార్,మహాదేవపూర్ :మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ తెలిపారు. గురువారం కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం10:30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్కూల్ బస్సు.. కారు ఢీ

- ముగ్గురు చిన్నారులకు స్వల్ప గాయాలు
- తీవ్రంగా గాయపడిన కారులోని మరో ముగ్గురు
- ప్రమాద సమయంలో బస్సులో 30 మంది పిల్లలు
- పరకాల- హుజురాబాద్ హైవేపై ఘటన
- క్షతగాత్రులను ఎంజీఎం తరలింపు..

ఘటనాస్థలంలో బోల్తా పడిన స్కూల్ బస్సు

అక్షర్ దర్బార్, పరకాల : పరకాల– హుజురాబాద్ ప్రధాన రహదారిపై కమలాపూర్ మండల కేంద్రం ఉమామహేశ్వరి ఫంక్షన్ హాల్ ఎదురుగా మూల మలుపు వద్ద ఏకశిలా పాఠశాలకు చెందిన బస్సును ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, స్కూల్ బస్సులో ముగ్గురు చిన్నారులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది విద్యార్థులు ఉన్నారు. గాయపడిన వారిని 108 సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.